‘చెత్త’గించరా..!

- ఖాళీ చేయరూ... బాడుగ చెల్లించరూ...
- ఏపీటీడీసీకి ఉపయోగపడని 1.44 ఎకరాల స్థలం
- స్థలాన్ని ఏళ్ల తరబడి ఉచితంగా వాడుకుంటున్న నగరపాలక సంస్థ


ఏపీటీడీసీ స్థలంలో నిలిపిన నగరపాలక సంస్థ వాహనాలు

కర్నూలు కల్చరల్: కర్నూలు నడిబొడ్డున వెంకటరమణ కాలనీలో రూ.కోట్లు విలువ చేసే టూరిజం ఆస్తి నిరుపయోగంగా మారింది. పర్యాటకులను ఆకర్షించాల్సిన ప్రాంతం డంపింగ్ యార్డ్‌గా మారింది. రూ.వందల కోట్ల విలువ చేసే ఆస్తి కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లే అవకాశం లేకపోలేదు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం తమకు పట్టనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. పర్యాటకంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామంటున్న ప్రభుత్వం ఆదాయాన్ని సమకూర్చే ఆస్తులను నిర్లక్ష్యం చేయడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. అధికారులు స్పందించి ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆస్తులను ప్రజా ప్రయోజనకరంగా మార్చాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

నిరుపయోగంగా 1.44 ఎకరాల స్థలం

ఒకప్పుడు వెంకటరమణ కాలనీలోని పున్నమి, హరిత రెస్టారెంట్ సందర్శకులతో కళకళలాడేవి. రెస్టారెంట్, వసతి గదులు, ఫంక్షన్ హాల్‌కు ఫుల్ డిమాండ్ ఉండేది. వీటి పక్కనే 1.44 ఎకరాల్లో స్కేటింగ్ రింగ్, విశాలమైన మైదానం ఉన్నాయి. 2002లో ఈ ఆస్తి విలువ రూ.20 కోట్లు. ప్యాకేజీ టూర్లలో భాగంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు ఏపీటీడీసీ బస్సుల రాకపోకలు ఇక్కడి నుంచే సాగించేవి. అప్పట్లో రూ.లక్షల్లో వ్యాపార లావాదేవీలు జరిగేవి. ఇవన్నీ గతం. ఇప్పుడు ఆ ప్రాంతం డంపింగ్ యార్డ్‌గా మారింది. ఆహ్లాదం పంచాల్సిన ప్రాంతంలో చెత్తను సేకరించే వాహనాలను నిలుపుతున్నారు. చిన్న వాహనాల నుంచి పెద్ద వాహనాల్లోకి చెత్తను మార్చుతుండటంతో ఆ ప్రాంతమంతా చెత్తచెదారంతో దుర్గంధ భరితంగా మారింది. గతంలో ఫంక్షన్ హాల్ నిత్యం ఏదో ఒక కార్యక్రమంతో కళకళలాడేది. ప్రస్తుతం కంపును భరించలేక ఆ ప్రాంతానికి రావడానికి ఎవరూ ఇష్టపడటం లేదు. వసతి గదులు సైతం బుక్ కావడం లేదు.

అద్దె చెల్లించరూ...

2020లో అప్పటి కమిషనర్ రెండు నెలలు చెత్త సరఫరా వాహనాలు నిలుపుకుంటామని ఏపీటీడీసీ అధికారుల అనుమతి తీసుకున్నారు. అప్పటి నుంచి చెత్తను సేకరించే సుమారు 30 వాహనాలు, మొబైల్ టాయిలెట్ వాహనాలను అక్కడే నిలుపుతున్నారు. అయితే ఐదు సంవత్సరాల నుంచి ఆ ప్రాంతమంతా నిరుపయోగంగా మారింది. నగరపాలక అధికారులు ఆ స్థలాన్ని ఖాళీ చేయరు. వాడుకుంటున్నందుకు అద్దె కూడా చెల్లించడం లేదు. నష్టాల్లో ఉన్న టూరిజం శాఖకు ఇది ఇబ్బందికరంగా మారింది. డంపింగ్ యార్డ్‌గా మారడంతో ఆ ప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతోంది. చుట్టపక్కల కాలనీ వాసులు పలుమార్లు ఫిర్యాదులు సైతం చేశారు. ఏపీ టీడీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సైతం నగర పాలక సంస్థ అధికారులను కలిసి ఆ ఆవరణను ఖాళీ చేయించాలని విన్నవించారు. ప్రస్తుతం నగర పాలక సంస్థ వాహనాలే కాకుండా బయటి వ్యక్తుల వాహనాలకు సైతం పార్కింగ్ స్థలంగా మారింది.


నిరుపయోగంగా బస్సుల క్లీనింగ్ భవన్

త్వరలోనే ఖాళీ చేస్తామన్నారు



నగరపాలక సంస్థ వాహనాల నిలుపుదలపై నేను డీవీఎంగా బాధ్యతలు స్వీకరించాక నగర పాలక కమిషనర్‌ను కలిసి సమస్యను విన్నవించాం. రెండు నెలల్లోగా ఖాళీ చేస్తామన్నారు. ఇప్పటికి ఒక నెల పూర్తయ్యింది. మరోసారి కలిసి మాట్లాడి ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకొని వినియోగించుకుంటాం.

– లక్ష్మీనారాయణ, డీవీఎం, ఏపీటీడీసీ

కేఎంసీ క్యాంటీన్‌పై కొనసాగుతున్న రగడ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో అసోసియేషన్ నాయకులుగా చెప్పుకునే వైద్యులు క్యాంటీన్‌పై గాకుండా వైద్య విద్యార్థుల చదువుపై దృష్టి సారించాలని క్యాంటీన్ నిర్వాహకులు డాక్టర్ వరప్రసాద్ సూచించారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన తర్వాత ప్రభుత్వ వైద్యుల సంఘం ఎన్నికలు జరగలేదని, ఇప్పుడున్నది అసోసియేషన్ కాదని అన్నారు. ప్రస్తుతం క్యాంటీన్ ఉన్న స్థలాన్ని కళాశాల 99 సంవత్సరాలకు సివిల్ అసిస్టెంట్ సర్జన్లకు లీజుకు ఇచ్చిందన్నారు. ఈ స్థలాన్ని బ్యాంకుకు ఎవరు లీజుకు ఇచ్చారని, బ్యాంకు వారు ఇస్తున్న అద్దె ఎవరికి చేరుతుందని ప్రశ్నించారు. మెడికల్ కాలేజీ మైదానంలో గుడి, ఇంటిని నిర్మిస్తే అసోసియేషన్ నాయకులుగా చెప్పుకుంటున్న వారు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు.

48 గంటల్లో క్యాంటీన్ ఖాళీ చేయాలి

కర్నూలు మెడికల్ కాలేజీలోని క్యాంటీన్‌ను 48 గంటల్లోగా ఖాళీ చేయాలని ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వారు క్యాంటీన్‌కు వెళ్లి అక్కడ పనిచేసే వారితో మాట్లాడారు. లీజు గడువు ముగిసినా అక్రమంగా క్యాంటీన్‌ను ఎలా నిర్వహిస్తారని, వెంటనే క్యాంటీన్‌ను అసోసియేషన్‌కు అప్పగించి వెళ్లిపోవాలని సూచించారు. అసోసియేషన్ నాయకులు డాక్టర్ బ్రహ్మాజీ మాస్టర్, డాక్టర్ దమామ్ శ్రీనివాసులు, డాక్టర్ సోమప్ప, డాక్టర్ రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆస్తమాను అశ్రద్ధ చేయొద్దు


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ జి.కుల్లాయప్ప

కర్నూలు(హాస్పిటల్): ఆస్తమాను అశ్రద్ధ చేయకుండా వైద్యులను కలిసి రెగ్యులర్‌గా మందులు వాడాలని ఊపిరితిత్తుల నిపుణులు డాక్టర్ జి.కుల్లాయప్ప చెప్పారు. ప్రపంచ ఆస్తమా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆయన తన క్లినిక్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన రోగులు, వారి సహాయకులకు ఆస్తమాపై అవగాహన కల్పించారు. వారికి ఊపిరితిత్తుల సామర్థ్య పరీక్షలు, పీఎఫ్‌టీ, స్పైరోమెట్రీ పరీక్షలు నిర్వహించి చికిత్స చేశారు. సీరియస్‌గా ఉన్న కొందరు రోగులకు అక్కడే నెబులైజేషన్, ఆక్సిజన్ అందించి స్వస్థత చేకూర్చారు.

ముగిసిన బైబిల్ తరగతులు


ర్యాలీ నిర్వహిస్తున్న కోల్స్ చర్చి సభ్యులు

కర్నూలు (టౌన్): వేసవి సెలవులను పురస్కరించుకుని కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చిలో పది రోజులుగా నిర్వహిస్తున్న విరామ బైబిల్ పాఠశాల తరగతులు మంగళవారం సాయంత్రం ముగిశాయి. ఈ సందర్భంగా చిన్నారులు కోల్స్ చర్చి నుంచి స్టేట్ బ్యాంక్ సర్కిల్, కొండారెడ్డిబురుజు వరకు ర్యాలీ నిర్వహించారు. పాస్టర్ రవికుమార్ మాట్లాడుతూ.. చిన్నారులే భావిభారత పౌరులని పేర్కొన్నారు. చిన్నారుల మంచి భవిష్యత్తు కోసం ఆధ్యాత్మిక కార్యక్రమాలతో కూడిన బైబిల్ పాఠశాల తరగతులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. చర్చి సభ్యులు అబ్రహం లింకన్, దేవమనోహర్ రాజు, సుధీర్ జార్జి, కిరణ్మయి, అనిల్ కుమార్, సంజీవ రావు, మధుకర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మారెమ్మ జాతర


మాతా మారెమ్మను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు కల్చరల్: బుధవార పేటలోని మాత మారెమ్మ ఆలయంలో మారెమ్మ జాతర ఉత్సవం వైభవంగా జరిగింది. మంగళవారం పరిసర కాలనీ వాసులు బోనాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి ఉత్సవంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, వార్డు నాయకులు భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మాతృపూజ


శ్లోకాలు పఠనం చేస్తున్న చిన్నారులు

కర్నూలు కల్చరల్: నెహ్రూనగర్‌లోని సాయి మందిరంలో మంగళవారం భక్తిశ్రద్ధలతో మాతృపూజ నిర్వహించారు. సత్యసాయి మాతృమూర్తి ఈశ్వరమ్మ వర్ధంతి పురస్కరించుకొని మందిరంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వేదం, భజన, భగవద్గీత శ్లోకాల పఠనం, వైదిక శ్లోకాల పఠనం, సమ్మర్ క్యాంప్ విజేతలకు బహుమతుల ప్రదానం కార్యక్రమాలు జరిగాయి. సాయి సేవా ట్రస్ట్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


కర్నూలు మార్కెట్ ధరలు (క్వింటా రూ..ల్లో

పంట	తక్కువ ధర	ఎక్కువ ధర
వేరుశెనగ	3600	6490
పొద్దుతిరుగుడు	4739	4739
ఆముదం	5651	5789
వాము	2000	18618
ఉల్లి	625	929
ఎండుమిర్చి	3200	8879
శనగలు	5468	5701
కందులు	3069	6919
మొక్కజొన్న	1919	2181
మినుములు	5011	6811
కొర్రలు	1696	2796
సోయాచిక్కుడు	1679	1679
సజ్జలు	1969	2196


ఫోన్ నంబర్ : 08518-257204, 257661

కుట్టు మిషన్ల నిధులపై విచారణ జరపాలి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు గడ్డం రామకృష్ణ

కల్లూరు: బీసీ మహిళలకు కుట్టు మిషన్లు అందజేసేందుకు కేటాయించిన నిధుల గోల్‌మాల్‌పై సమగ్ర విచారణ చేపట్టాలని వైఎస్సార్‌సీపీ కురువ రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం రామకృష్ణ కోరారు. మంగళవారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లోని సమావేశ హాలులో బీసీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ.. లక్ష మంది బీసీ మహిళలకు జీవనోపాధి కల్పించేందుకు ఉచితంగా కుట్టు మిషన్లు, వారికి శిక్షణ కోసం ప్రభుత్వం కేటాయించిన రూ.230 కోట్లలో దాదాపు రూ.150 కోట్లు పక్కదారి పట్టించారన్నారు. నిధుల గోల్‌మాల్‌పై గవర్నర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. మార్కెట్‌లో మంచి పేరు ఉన్న మిషన్లు ఉన్నా వాటిని కాదని గుజరాత్‌లో తయారు చేసిన మిషన్లను మహిళలకు ఇస్తున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకరికే లబ్ధి చేకూర్చేలా టెండర్ విధానం ఉందని, అలాకాకుండా ఏ జిల్లాకు ఆ జిల్లాలో సెక్యూరిటీ, లేబర్ కాంట్రాక్ట్ విధానం అమలు చేయలన్నారు. వైఎస్సార్‌సీపీ గత ఐదేళ్ల పాలనలో సచివాలయాల పరిధిలో ఎంత మందికి సంక్షేమ పథకాలు అందించిందో, నిర్దిష్టమైన డాటా ఉండేదన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో నాయకుల పెత్తనం పెచ్చుమీరిందన్నారు. కుట్టు మిషన్ల పేరిట రూ.150 కోట్లు జేబులో వేసుకున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ నాయకులు ధనుంజయ్య ఆచారి అన్నారు. బీసీలకు రక్షణ చట్టం తీసుకురావాలని కోరారు. జిల్లాకు 1200 యూనిట్లు బీసీ రుణాలు అని చివరికి 500 యూనిట్లు మాత్రమే ఇచ్చారని యద్దేవా చేశారు. వాటిలో కూటమి పార్టీల అనుయాయులకు కేటాయింపులు జరిగినట్లు సమాచారం ఉందన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



కృష్ణగిరి: వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు మండల పరిధిలోని అమకతాడు గ్రామంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం సుప్రభాత సేవతో ఉత్సవాలను వేదపండితులు ప్రారంభించారు. స్వామి వారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. రాత్రి 8 గంటలకు గోవిందమాంబ సమేత శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవ విగ్రహాలకు భక్తుల సమక్షంలో గ్రామానికి చెందిన కోయిల కొండ వీరభద్రుడు, సుజాతమ్మ దంపతులు కల్యాణం జరిపించారు. బుధవారం గురుపూజ మహోత్సవం భక్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం రాష్ట్ర స్థాయి పాలపళ్ల ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో గెలుపొందిన ఎద్దుల యజమానులకు దాతల సహకారంతో వరుసగా రూ. 30వేలు, రూ. 20వేలు, రూ.10వేలు, రూ. 5వేల చొప్పున నగదు బహుమతి అందించనున్నారు. సాయంత్రం స్వామి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ వీధులు గుండా ఊరేగిస్తామని, ఉత్సవం వెంట నందికోళ సేవ, చెక్కభజన కార్యక్రమం ఉంటుందని వారు తెలిపారు.

ఛత్రపతి సర్కిల్‌గా నామకరణం

కల్లూరు: ఉల్చాల రోడ్డు వై-జంక్షన్‌కు ఛత్రపతి శివాజీ మహరాజ్ సర్కిల్‌గా నామకరణం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ఛత్రపతి శివాజీ కూడలిని ప్రారంభించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎల్లమ్మకు రూ.లక్ష విరాళం


చెక్కును దేవస్థానం ఈఓ పీఎన్ రాధాకృష్ణకు అందజేస్తున్న దాత పురుషోత్తం రెడ్డి

కర్నూలు(రూరల్): వెంకాయపల్లె గ్రామ సమీపంలో వెలసిన ఎల్లమ్మ అమ్మవారి ఆలయం అభివృద్ధికి జి.వీరాపురం గ్రామానికి చెందిన పురుషోత్తం రెడ్డి రూ. లక్ష విరాళంగా అందజేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఈఓ పీఎన్ రాధాకృష్ణకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా దాతకు ఈఓ అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆర్‌యూ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి


ఆర్‌యూ రిజిస్ట్రార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏఐఎస్‌ఏ నాయకులు

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐఎస్ఏ ఆధ్వర్యంలో మంగళవారం వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ విజయ్‌కుమార్ నాయుడుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి ఎస్.నాగార్జున మాట్లాడుతూ.. మెస్‌లో మెనూ సక్రమంగా పాటించడం లేదని, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడం లేదని ఆరోపించారు. హాస్టల్ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం, మెనూ ప్రకారం సరుకులు ఇవ్వకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. హాస్టళ్లలో మరమ్మతులు నెమ్మదిగా జరుగుతున్నాయన్నారు. వీటన్నింటిని గాడిలో పెట్టేందుకు కొత్త కమిటీలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నాయకులు మౌలాలి, సునీల్, సాయి, కృపాకర్ తదితరులు రిజిస్ట్రార్‌కు వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

రిజర్వేషన్ల పితామహుడు సాహూ మహరాజ్


సాహు మహరాజ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నంది విజయలక్ష్మి

కర్నూలు(అర్బన్): అట్టడుగున ఉన్న బడుగు, బలహీన వర్గాలకు రిజర్వేషన్లు అవసరమని భావించి ఆ దిశగా చర్యలు చేపట్టిన మహోన్నత వ్యక్తి సాహూ మహరాజ్ అని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి అన్నారు. మంగళవారం సాహూ మహరాజ్ వర్ధంతి సందర్భంగా స్థానిక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నంది విజయలక్ష్మి మాట్లాడుతూ.. కొల్హాపూర్ సింహాసనాన్ని అధిష్టించిన సాహు మహరాజ్ దళిత, బహుజనులకు సామాజిక న్యాయ, ప్రజాస్వామిక తాత్విక పునాదిని ఏర్పరచి ప్రజల రాజుగా మిగిలిపోయారని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తిని స్మరించుకుంటూ ఆయన చూపిన మార్గంలో ప్రతిఒక్కరూ నడవాలన్నారు. మహిళా నాయకురాలు పాలెం రాధ తదితరులు పాల్గొన్నారు.

షర్మిళ పర్యటన వాయిదా

కర్నూలు (సెంట్రల్): పీసీసీ అధ్యక్షురాలు షర్మిళ కర్నూలు పర్యటనను కొన్ని అనివార్య కారణాలతో వాయిదా వేసుకున్నట్లు నగర కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తదుపరి పర్యటన ఎప్పుడనేది త్వరలోనే ప్రకటిస్తామని ఆయన వెల్లడించారు.

ఈ-శ్రామ్ కార్డులపై అవగాహన

కర్నూలు(రూరల్): ఈ – శ్రామ్ కార్డుల ఆవశ్యకతపై కార్మికులకు అవగాహన కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి అన్నారు. స్థానిక మండల పరిషత్ మీటింగ్ హాల్‌లో మంగళవారం ఈ శ్రామ్ కార్డులపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా వివిధ రంగాల్లో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ ఈ – శ్రామ్ కార్డులు అందేలా కృషి చేస్తామన్నారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసరు హేమాద్రి మాట్లాడుతూ ఈ శ్రామ్ కార్డులు పోర్టర్‌లో ఎలా నమోదు చేసుకోవాలనే అంశంపై అవగాహన కల్పించారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద ప్రతి కార్మికునికి రూ. రెండు లక్షల ప్రమాద బీమా ఉచితంగా కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కర్నూలు మండల ఎంపీడీఓ రఘునాథ్, మండల విద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు

వెల్దుర్తి: ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును ఢీకొన్న ఘటనలో యువకుడికి గాయాలయ్యాయి. అల్లుగుండు స్టేజ్ వద్ద మంగళవారం జాతీయ రహదారిపై ఈ సంఘటన జరిగింది. కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా కిట్ట గ్రామానికి చెందిన గజానందరెడ్డి బైక్‌పై బెంగళూరు నుంచి హైదరాబాద్ వైపు హైవే 44పై వెల్దుర్తి మీదుగా వెళ్తున్నాడు. అల్లుగుండు బస్‌స్టాప్ వద్ద ప్రయాణికులను దింపేందుకు డోన్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఆగి ఉంది. ఈ బస్సును ఓవర్ టేక్ చేసే ప్రయత్నంలో ఎదురుగా మరో వాహనం ఉండడం గమనించిన బైకిస్టు ఆగి ఉన్న బస్సును వెనుక నుంచి ఢీ కొన్నాడు. తలకు హెల్మెట్ ఉండటంతో ప్రాణాపాయం తప్పింది. బస్సు డ్రైవర్ కొత్తపల్లి బాషా, కండక్టర్ రెడ్డి 108కు సమాచారం అందించి క్షతగాత్రుడిని వెల్దుర్తి సీహెచ్‌సీకి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

ఆర్‌టీసీ బస్సు నుంచి పొగలు

గోనెగండ్ల: మండల కేంద్రమైన గోనెగండ్ల బస్టాండ్‌లో కర్నూలు-2 డిపోకు చెందిన ఆర్‌టీసీ బస్సులోని రేడియేటర్ వెడెక్కడంతో పొగలు వచ్చాయి. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులు భయందోళనకు గురయ్యారు. గుర్తించిన డ్రైవర్ చాకచక్యంగా బస్సును నిలిపివేసి ప్రమాదం నుంచి తప్పించాడు. మంగళవారం మధ్యాహ్నం కర్నూలు డిపోకు చెందిన ఆర్‌టీసీ బస్సు కర్నూలు నుంచి ఆదోనికు బయలు దేరింది. గోనెగండ్ల బస్టాండ్‌కు చేరుకోగానే ఇంజిన్ బానెట్ నుంచి పొగలు రావడంతో ప్రయాణికులు భయందోళనకు గురయ్యారు. ప్రమాదాన్ని వెంటనే గుర్తించిన డ్రైవర్ బస్సు ఇంజిన్‌ను వెంటనే ఆపివేశాడు. ప్రయాణికులను కిందకు దించారు. కండెక్టర్ వారిని వేరే బస్సుకు ఎక్కించి పంపించారు. పక్కనే ఉన్న హోటల్ నుంచి బకెట్‌లో నీటిని తీసుకువచ్చి రేడియేటర్‌ను చల్లార్చేందుకు ప్రయత్నించారు.

ఆశాల సమస్యలు పరిష్కరించాలి

కోడుమూరు రూరల్: అపరిష్కృతంగా ఉన్న ఆశావర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి వీరన్న డిమాండ్‌చేశారు. ఈ మేరకు మంగళవారం లద్దగిరి పీహెచ్‌సీ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశావర్కర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వీరన్న మాట్లాడుతూ లేబర్ కోడ్‌ను రద్దు చేసి, ఆశా కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఆశా కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆశాలకు వర్తింపజేయాలని, రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. సమస్యల పరిష్కారంలో భాగంగా ఈనెల 20న జరిగే సమ్మెలో ఆశావర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని వారు పీహెచ్‌సీ వైద్యాధికారి డా.భాస్కర్, ఆశా నోడలాఫీసర్ శారదలకు అందజేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు సుబేదా, అశ, సరోజ, సువర్చల, సరస్వతి, రేణుక, లక్ష్మి, సుజాత, కృప, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

కిల్కారి మెసేజ్‌తో మాతాశిశువులకు రక్షణ


మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కిల్కారి మెసేజ్ విధానంతో మాతాశిశు మరణాలు తగ్గుముఖం పడతాయని డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ చెప్పారు. ఆమె మంగళవారం ముజఫర్‌నగర్‌లోని యూపీహెచ్‌సీలో నిర్వహించిన ఆశా సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఆరోగ్యశాఖలో మాతాశిశు సేవలను బలోపేతం చేయడంలో భాగంగా కిల్కారి మెసేజ్ విధానాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ విధానంలో గర్భిణీ స్త్రీలకు నాలుగో మాసం నుంచి కాన్పు తర్వాత ఒక సంవత్సరం వరకు వారానికి ఒకసారి చొప్పున 01244451660 నంబర్ నుంచి వాయిస్ మెసేజ్ వస్తుందని, ఏదైనా కారణం వల్ల గర్భిణీ/తల్లి ఆ వాయిస్ మెసేజ్ వినలేకపోతే తర్వాత 14423 నంబర్‌కు కాల్ చేసి వినవచ్చని చెప్పారు. వాయిస్‌కాల్‌లో మాత, శిశు ఆరోగ్యసేవలు, వ్యాధి నిరోధక టీకాలు, కుటుంబ నియంత్రణ సేవల గురించి సలహాలు, సూచనలు వివరిస్తారన్నారు. అలాగే ఎన్‌సీడీ 3.ఓ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రమాదకర లక్షణాలు కలిగిన గర్భిణులను సమాయానుసారంగా రెఫర్ చేసి తగు చికిత్సలు అందేలా చూడాలన్నారు. డీపీఎంవో డాక్టర్ ఉమ, డీపీఓ విజయరాజు, యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుప్రియ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

- నగరంలోని గడ్డ యూపీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన ఆశా సమీక్ష సమావేశంలో మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు శెట్టి పాల్గొన్నారు. కిశోర బాలికల ఆరోగ్యం, వడదెబ్బ లక్షణాలు, ప్రథమ చికిత్సపై పీసీ పీఎన్‌డీటీ చట్టంపై అవగాహన కల్పించారు. ఆశా యాప్‌లో అర్హులైన దంపతుల సేవలు, ఐరన్ మాత్రల పంపిణీ, విటమిన్-ఎ ద్రావణ వివరాలను క్రమం తప్పక అప్‌లోడ్ చేయాలన్నారు. వైద్యాధికారి డాక్టర్ సాత్విక, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అనాథాశ్రమ నిర్వాహకులపై ఆగ్రహం


సాయి అనాథాశ్రమంలోని వారితో మాట్లాడుతున్న బి.లీలా వెంకటశేషాద్రి

కర్నూలు (అర్బన్): నగరంలోని బుధవారపేట సాయి అనాథాశ్రమం నిర్వాహకులపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మంగళవారం ఆశ్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడున్న నిరాశ్రయులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమంలో రికార్డులు సక్రమంగా నిర్వహించడం లేదని, పరిశుభ్రత పాటించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే మెనూ ప్రకారం ఆహారం అందించడం లేదని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆశ్రమాన్ని శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు.

కీర్తన అనాథాశ్రమంలో...

నగరంలోని వెంకటరమణ కాలనీలో ఉన్న కీర్తన అనాథాశ్రమాన్ని కూడా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.వెంకటలీలా శేషాద్రి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశ్రమంలో రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలని, పరిశుభ్రత పాటిస్తూ, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

10 నుంచి సాంస్కృతిక వారోత్సవాలు

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రంలో వేసవి వినోదంగా ఈ నెల 10వ తేదీ నుంచి వారం రోజుల పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు, కళారత్న పత్తి ఓబులయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కళాక్షేత్రం గౌరవ చైర్మన్ టీజీ వెంకటేష్ 75వ జన్మ దినోత్సవం సందర్భంగా ప్లాటినం జూబ్లీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమాలు ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు ప్రారంభమవుతాయని తెలిపారు. 10వ తేదీ ఎస్.మహమ్మద్ మియా నిర్వహణలో జానపద సంగీత నృత్య విభావరి, 11న శ్రీరామాంజనేయ యుద్ధం సీను, 12న కవయిత్రుల సమ్మేళనం, 13న కర్నూలు నగరంలోని నాట్యాచార్యులచే శాస్త్రీయ జానపద నృత్య ప్రదర్శనలు, 14న గాయని సుధారాణి గజల్ గాయకుడు మహమ్మద్ మియ పర్యవేక్షణలో సంగీత విభావరి, 15న టీజీవీ కళాక్షేత్రం సహాయ కార్యదర్శి సంగా ఆంజనేయులు పర్యవేక్షణలో బావా ఎప్పుడు వచ్చితీవు సాంఘిక నాటక ప్రదర్శన, 16న జబర్దస్త్ కళాకారులు వినోదిని, అప్పారావు, గడ్డం నవీన్, రాజమౌళి, కార్తీక్ బృందంచే జబర్దస్త్ కామెడీ స్కిట్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతిరోజూ కళాకారులకు సత్కారం ఉంటుందని, సాహిత్య సంగీతాభిమానులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి


అధికారులతో మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు(టౌన్): గత సమావేశాల్లో చర్చించిన ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని మంత్రి టీజీ భరత్ నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. ఆయన మంగళవారం స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో నగరపాలక అధికారులతో సమీక్ష నిర్వహించారు. తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా సుంకేసుల జలాశయంలో తగిన నీరు ఉండేలా చూసుకోవాలన్నారు. సుద్దవాగులో పూడికతీత పనులు చేపట్టాలని, అవసరమైన చోట రక్షణ వలయం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. జులై నెలాఖరుకు ఎస్ఏపీ క్యాంప్‌లో బైపాస్ రహదారి పూర్తి చేయాలని సూచించారు. కమిషనర్ ఎస్.రవీంద్రబాబు, అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్‌రెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సకాలంలో వైద్య సేవలందించాలి



మాట్లాడుతున్న డాక్టర్ రఘు

ఓర్వకల్లు: గర్భిణులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని సంచార చికిత్స కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ రఘు అన్నారు. మంగళవారం మండలంలోని నన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆశాల మాసాంతపు సమావేశాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి గర్భిణీ వివరాలను 12 వారాల లోపు నమోదు చేయాలన్నారు. ప్రతి కాన్పు ప్రభుత్వ ఆసుపత్రులలో జరిగేలా చూడాలని సూచించారు. గర్భిణులు, బాలింతలకు, కౌమారదశ బాలికలకు రక్తహీనతపై అవగాహన కల్పించాలన్నారు. సామాజిక ఆరోగ్య అధికారి డా. రాధామోహన్, పీఎచ్ఎన్ విజయలక్ష్మి, క్షేత్రస్థాయి పర్యవేక్షకులు మంగమ్మ, ఆనమ్మ, ఆశా కార్యకర్తలు, ప్రాజెక్టనిస్టు ఖలీల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.